# భారత విప్లవ శక్తులు బాల్‌గోపాల్ సంధాన కృషిని ప్రజాస్వామిక స్ఫూర్తిని గౌరవిస్తూ సాగాలి

**బాలగోపాల్** పౌర ప్రజాస్వామిక హక్కుల పోరాట కారుడిగా లోకానికి ఎక్కువగా తెలుసు. హక్కుల ఉద్యమానికి చారిత్రక అవసరాన్ని కల్పించిన విప్లవ ప్రజా ఉద్యమాలకు ఆయన అత్యంత ప్రీతిపాత్రుడు. ఆయన లేని లోటు విప్లవ ప్రజా ఉద్యమానికి సాధారణంగా పూడ్చలేనిది. అసాధారణమైన ఆచరణ కృషిలో, విశాలమైన మేధోమదనంతో ఆంధ్ర రాష్ట్రంలో ఆయన సాగించిన కృషి విలువ కట్టలేనంత గొప్పది..

చరిత్ర తత్వశాస్త్రం, సాహిత్యం, అర్ధశాస్త్రం, జెండర్ సమస్యలు, దళిత సమస్యలు, ఆదివాసీ కడగండ్లు, ఎండిన డొక్కల అరుపులు అన్నింటిలో తన విశ్లేషణతో, ఉపన్యాసాలతో తెలుగునాట ఒక చైతన్యపతాకగా 3 దశాబ్దాల కాలం పాటు వెలుగొందాడు. డాక్టర్ బాలగోపాల్ నుంచి ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి ఉద్యమం, యువజనోద్యమం 1980 దశకంలో ఎంతో ఉత్తేజం పొందింది. ఈ ఉద్యమాల నుంచి ఆయన హక్కుల ఉద్యమకారుడిగా విప్లవోద్యమం ఆయన కృషిని రంగరించుకున్నది. హక్కుల ఉద్యమానికి ఆయన చిరునామా-పాలకులకు దడపుట్టించిన, ఈ హక్కుల ఉద్యమ బుడతడ్ని కాలరాయాలని రాజ్యం ఎన్నెన్నో రాక్షస దమన పద్ధతుల్ని అనుసరించినా తలెత్తి నిలిచాడు తప్ప-ఎన్నడూ, ఏ స్థితిలోనూ తలవాల్చలేదు. చావు ఆయనను చూసి భయపడింది తప్ప, చావును చూసి ఆయన భయపడలేదు.

నేను పి.డి.ఎస్.యు. రాష్ట్ర స్థాయి కార్యకర్తగా, తర్వాత కాలంలో ప్రధాన కార్యదర్శిగా వున్నప్పుడు విద్యారంగ సమస్యలు, సామాజిక సమస్యలమీద ఆయన చేసిన ప్రసంగాలు సామాజిక కార్యాచరణకు నన్ను నాతోపాటు అనేక మందిని పురికొల్పాయి ఆయన గణితంలో అగణిత మేధావిగా వున్నా విద్యార్థులతో, ప్రజలతో ఎంతగానో కలసిపోయేవారు. డైరీ చేతపట్టుకొని పరిశోధకుడిగా ఎన్‌కౌంటర్ల ప్రదేశాలు, అణచివేత ప్రదేశాలు, బాధితుల ఆర్తనాదాల స్థావరాలు, అడవులు, కొండలు, తీరప్రాంతాలు, దూరప్రాంతాలూ అంకిత భావంతో తిరిగిన తీరు ప్రజల మేధావికి అర్థం కల్పించాడు. ఆయన సింపుల్‌సిటీ, ఆదర్శనీయ, ఆచరణ, ఆయనకు ఆయన మేధో వికాసం నుంచి అలవడిన సహజ అలంకారాలు. అవి తెచ్చిపెట్టుకున్నవికావు. ఆలోచనను, పనిని తప్ప కాయాన్ని పట్టించుకోని తీరు ఆయనకు మరణాన్ని ముందే తీసుకువచ్చింది. అవే తెలుగునాట ప్రజామేధావిగా ఆయనను అందనంత ఎత్తున నిలబెట్టాయి. గ్రంథాలను వల్లెవేస్తూ, లైబ్రరీలో పుస్తకాల పుటల్లో తలమునకలవుతూ చెమటకారని కార్యాచరణతో, ప్రజా కార్యాచరణ మీద సెగల, పొగల వ్యాఖ్యానాలతో సరిపుచ్చి బుద్ధిజీవుల బౌద్ధిక కార్యాచరణ పూర్తయ్యిందనిపించే మేధోవర్గాలు పుష్కలంగా వున్న యీ రోజుల్లో ప్రజా కార్యక్షేత్రంలో తన మేరునగ మేధస్సును సమ్మేళనపరచిన బాలగోపాల్ మేధావివర్గ నిజమైన పాత్రకు ప్రత్యక్ష తార్కాణంగా నిలిచాడు.

రాజ్యం మరింత మరింతగా సాయుధమై, మిస్సింగ్ హత్యలు, కిడ్నాప్‌లు, ఎన్‌కౌంటర్లు, కాల్పులు, తదితర తీవ్ర అణచివేత చర్యల్ని ఇజ్రాయిల్, అమెరికా సామ్రాజ్యవాదం నుంచి అరువు తెచ్చుకొని సాఫిస్టికేషన్ అవుతున్న వేళల్లో రాజ్యరక్తపాత, దుర్మార్గ స్వభావాన్ని అంతే పదునుగా బాలగోపాల్ ఎత్తిచూపాడు. ఆ అణచివేతకు స్వయంగా గురయ్యాడు. హక్కుల తరఫున నిలబడి, అణచివేతపై గొంతెత్తినందుకే యాదగిరిరెడ్డి (ఎస్.ఐ) హత్యకేసులో ఇరికించారు. నాసా కింద జైల్లో పెట్టారు. 1989లో ఖమ్మం జల్లా కొత్తగూడెంలో పోలీసులు మఫ్టీ డ్రెస్‌లో వచ్చి కొట్టి మురికి కాలవలో పడేసి చనిపోయాడనుకున్నారు. కొత్తగూడెంలో అడ్వకేట్ పురుషోత్తంతో వెళ్ళి రక్షించబడి హాస్పిటల్‌లో చేర్పించారు. అయినా మఫ్టీ డ్రెస్‌లో పోలీసులు హాస్పటల్ అంతా ఆక్రమించారు. మాజీ ఎం.ఎల్.ఏ. గుమ్మడి నర్సయ్య తదితరులు వెళ్ళిన తరువాత పోలీసులు జారుకున్నారు. ఆ తరువాత ఖమ్మంలో బాలగోపాల్‌ను పి.డి.ఎస్.యు.

విద్యార్థి శ్రీమన్నారయణను కిడ్నాప్ చేసి గంతలు కట్టి తీసుకుపోయారు. పెద్దనిరసన, ఒత్తిడి వచ్చిన తరువాత వదిలేశారు. రాష్ట్ర పోలీసు దాడులు, హత్యాప్రయత్నాలు బెదిరింపులతోపాటు, వరంగల్‌లో ఆర్.ఎస్.ఎస్. బి.జె.పి. రౌడీమూక సైతం వీరిపై దాడిచేసింది. వీటన్నింటిని నిబ్బరమైన గుండె ధైర్యంతో ఎదుర్కొని నిలబడటం గొప్పతనం. అసాధారణ తత్వం.

నిత్య నిర్బంధంలోసైతం హక్కుల గొంతును మూగపోనివ్వని బాలగోపాల్ ఆంధ్రరాష్ట్రంలో విప్లవ శక్తుల మధ్య పరస్పర మౌనాన్ని చూసి చాలా ఆవేదన చెందాడు. మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ, తూర్పు గోదావరి తదితర జిల్లాలో ప్రధానంగా మావోయిస్టుపార్టీ సి.పి.ఐ (యం.ఎల్.) న్యూడెమోక్రసీపై అలానే జనశక్తికి మధ్య తీవ్రంగా జరిగిన సాయుధ సంఘర్షణలను వ్యతిరేకించాడు. ప్రజల తరఫున పోరాడాల్సిన శక్తులు ప్రజలపైనే దాడిచేసుకొనే స్థితి ప్రజా ఉద్యమాలకు నష్టమని స్పష్టంగా చెప్పాడు. ఈ సమస్య సైతం హక్కుల ఉద్యమానికి సమస్యగానే చూశాడు. దీనిని ఆవేదనతో సరిపుచ్చుకోలేదు. నడుంకట్టి సయోధ్యకు యత్నించాడు. తనతోపాటు అనేక హక్కుల సంఘాలను, మేధావులను కలుపుకొని ఆయా ప్రాంతాలకు వెళ్ళి పార్టీల నాయకత్వంతోను మాట్లాడి ఘర్షణలు నివారించాలని కోరాడు. తీవ్ర కృషితో కొంత ఫలితాన్ని సాధించాడు.

2006-2007 కాలంలో జిల్లాలో సి.పి.ఐ (యం.ఎల్) న్యూడెమోక్రసీ నాయకత్వం మీద ఆనాటి ఎం.ఎల్.ఏ. గుమ్మడి నర్సయ్యపై డెత్‌వారెంట్‌గా మావోయిస్టు పార్టీ నాయకత్వం (జిల్లా) ప్రకటనలు చేస్తే, నాతోపాటు, పార్టీ నాయకత్వం అయిన మేము బాలగోపాల్‌ను కలిస్తే, 'ఒకరి స్వేచ్ఛ, మరొకరి చావు కొస్తే ఎలా" అని వ్యాఖ్యానించాడు. మావంతు యత్నం చేస్తాం. వింటారో వినరో అని వ్యాఖ్యానించాడు. ముక్తసరిగా రెండే వ్యాఖ్యానాలు చేసినా ఆ వ్యాఖ్యానాలకు లోతైన అర్థం వుంది. విశాల ప్రజల విస్తృత ఉద్యమ ప్రయోజనాలు ఆశించే పార్టీలు హక్కుల గొంతు విననంత దూరంగా జరుగుతున్నాయనే అందులో యిమిడి ఉంది.

డాక్టర్ బాలగోపాల్ లాంటి విశాల దృష్టి కలిగిన మేధావి లేకపోవడం విప్లవోద్యమాల మధ్య సయోధ్యనెరిపే మిత్రుడు లేకపోవడమే. మనల్ని పొగడటమే పనిగా వుండే మేధావులకంటే విమర్శనాత్మకంగా సహృదయంతో వారించే అలాంటి

వారు ప్రస్తుత పరిస్థితులకు ఎంతో అవసరం. వాలున పడి కొట్టుకుపోయే మేథోతరం కంటే, నిలబడి సాలోచనగా సాగిపోయే ఆలోచనా ప్రవాహమే నేడు ఎంతో అవసరం. బాలగోపాల్ కొన్ని రాజకీయాభిప్రాయాలపట్ల విప్లవోద్యమానికి కొన్ని అభ్యంతరాలున్న మాట వాస్తవమే. అయినా అది ఆయన కృషిని మొద్దుబార్చలేదు. హితుడిగా, సన్నిహితుదుగా, సునిశిత విమర్శకుడిగా విప్లవోద్యమంతో కలిసినడిచాడు.

ఆయన స్ఫూర్తిని నిలపగలిగే కృషిని మేధావివర్గం, యువతరం చేయాలి. అలానే విప్లవోద్యమ పాయలన్నీ రాజకీయ, సిద్ధాంత సంఘర్షణలను మరింత పదునుగా కొనసాగించినా, భౌతిక నిర్మూలనా కార్యక్రమంను దూరంగా తీసివేయాలి. నిందలు, దాడులు హత్యాకాండ లాంటి వాటిని ప్రక్కకు పెట్టి చర్చ, ఆచరణ, పరస్పర గౌరవాలను విప్లవశక్తులు పుణికి పుచ్చుకోవాలి. రెండున్నర దశాబ్దాలుగా డాక్టర్ బాలగోపాల్ చేసిన కృషి విప్లవోద్యమ వెలుగులో చేసినదే. వెలుగుల ప్రస్థానమే ఆయనది. 4 దశాబ్దాల విప్లవోద్యమం యొక్క త్యాగాల విప్లవాల కృషిని అద్దంలో ప్రతిమను చూసుకుంటూ, బేరీజు వేసుకుంటూ, సరిచేసుకుంటూ ప్రజా అంకిత యాత్రలో ముందుకు సాగాలి. సామ్రాజ్యవాదం, దళారి ధనస్వామ్యం, భూస్వామ్యం, ఆధునిక రూపాలతో ప్రజలమీద, దేశవనరులమీద, ప్రజాశక్తుల మీద పెనుదాడిని సాగిస్తున్న వేళ భారతదేశంలో విప్లవ ప్రజాస్వామిక శక్తులన్నీ బాలగోపాల్‌లోని పాజిటివ్ అంశాలన్నింటికి స్వంతం చేసుకోవాలి.

**– పోటు రంగారావు**

సి.పి.ఐ. (యం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు